AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
20-3-2026 (Friday) MAIN EDITION

## హైదరాబాద్‌లో మెట్రో సేవలకు అంతరాయం..




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో మెట్రో సేవలకు అంతరాయం కలిగింది. సాంకేతిక సమస్యతో నాగోల్‌రాయదుర్గం మార్గంలో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమీర్‌పేట్‌రాయదుర్గం మార్గంలో అంతరాయం కలిగింది. జూబ్లీ చెక్‌పోస్టు దగ్గర నిలిచిపోయిన మెట్రో రైలు ఆగిపోయింది. దీంతో ఆ మార్గంలో రెండు వైపులా రైళ్లు నిలిచిపోయాయి. సాంకేతిక నిపుణులు సమస్యను పరిష్కరించారు. గతంలో సైతం పలుమార్లు సాంకేతిక సమస్యతో మెట్రో రైళ్లు నిలిచిపోయాయి.

## అమెరికాపై హెచ్‌ఎంపీవీ వైరస్ పంజా..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అగ్రరాజ్యం అమెరికకు మరో ముప్పు పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. ఆ దేశంలో కొత్తగా ఒక వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు వార్తలు కూడా వెలువడుతున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారం 'ఎక్స్'లో వైరల్ పోస్టులు వైరల్ అవుతున్నాయి. 'చికిత్స లేని ప్రమాదకర వైరస్'గా పేర్కొంటున్న దీని అసలు పేరు హ్యూమన్ మెటాప్న్యూమో వైరస్. కాగా, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## పెరిగిన పవర్ పెట్రోల్ ధర



అక్షరటుడే, ఢిల్లీ: దేశంలో 'పవర్' పెట్రోల్ ధర పెరిగింది. హెచ్‌పీసీఎల్ లీటర్‌పై రూ.2.26 రేటు పెరిగినట్లు ఎన్డీటీవీ తెలిపింది. ఇక సాధారణ పెట్రోల్ రేటు ఎలాంటి మార్పు లేదని పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల క్రూడాయిల్ సరఫరా తగ్గడంతో ధరలు సవరించినట్లు సమాచారం. ఇప్పటికే గ్యాస్ ధరలు పెరిగిన విషయం తెలిసిందే.

## రానున్న 24 గంటల్లో ఏపీలో వర్షాలు



అక్షరటుడే, ఏపీ: పశ్చిమ బంగాళాఖాతం సమీప ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీంతో రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో జల్లులు పడే అవకాశముంది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తేలికపాటి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

## ఘోర రోడ్డుప్రమాదం.. 8 మంది మృతి




అక్షరటుడే, తమిళనాడు : తమిళనాడులోని సేలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీ వ్యాన్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆ వెనుకనే మరో బైకు ఢీకొంది. దీంతో 11 నెలల చిన్నారి సహా 8 మంది మృతిచెందారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉన్నారు. బైక్‌పై వచ్చిన తల్లీకూతురు మరణించారు.




## వాట్సాప్‌లో ఇక నుంచి ప్రత్యేక ఐడీలు

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ మెసెజింగ్ యాప్ వాట్సాప్ కీలక నిర్ణయం తీసుకుంది. యూజర్‌నేమ్, ప్రత్యేక ఐడీలతో లాగిన్ అయ్యే విధంగా మార్పులు తీసుకు రానుంది. ప్రస్తుతం ఫోన్ నంబర్ ద్వారా వాట్సాప్ అకౌంట్ ఓపెన్ అవుతుంది. లాగిన్ కావాలన్న ఫోన్ నంబర్‌తోనే. ఈ క్రమంలో వాట్సాప్ వినియోగించాలంటే ప్రజలు తప్పనిసరిగా ఫోన్ నంబర్ ఇతరులతో పంచుకోవాలి. ఫోన్ నంబర్ల నుంచి యూజర్‌నేమ్‌లు, ప్రత్యేక ఐడీలకు మారడంతో వాట్సాప్ తన ప్లాట్‌ఫామ్‌లో అతిపెద్ద మార్పునకు సిద్ధమవుతోంది. ఫోన్ నంబర్లను పంచుకోకుండానే సందేశాలు పంపడానికి, వాయిస్ లేదా వీడియో కాల్స్ చేయడానికి వీలవుతుందని సమాచారం. 2026 జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా యూజర్‌నేమ్‌లను అందుబాటులోకి తీసుకురానుంది.



## మరింత పడిపోయిన రూపాయి

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత పడిపోయింది. ప్రస్తుతం ఒక డాలర్‌కు 93.20 వద్ద ట్రేడింగ్ అవుతోంది. పశ్చిమాసియా సంఘర్షణ మధ్య గ్రీన్ బ్యాక్ మరింత బలపడడం, ఎఫ్ఐఐ అవుట్ ఫ్లోలతో రూపాయి బలహీనం అవుతోంది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి, ముడిచమురు ధరల ఒత్తిడితో శుక్రవారం రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే 93.12 వద్ద రికార్డు కనిష్ట స్థాయికి పడిపోయింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభం అయ్యాక దేశీయ కరెన్సీ రూపాయి నష్టాలు దాదాపు 2 శాతానికి చేరాయి. ప్రపంచ ఇంధన సరఫరాలో అంతరాయాలు, ఆసియాలోని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ యొక్క వృద్ధిద్రవ్యోల్బణ సమతుల్యతను ప్రభావితం చేస్తూ దానికి ముప్పుగా కొనసాగుతున్నాయి. కరెన్సీ బలహీనపడినప్పటికీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లు కోలుకున్నాయి.



# బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు

తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆరోగ్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసింది. సంక్షేమ పథకాల కోసం భారీగా కేటాయింపులు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. రూ.3.24 లక్షల కోట్లతో తెలంగాణ పద్దును సమర్పించారు. కొత్తగా పలు పథకాలు అమలు చేస్తామని ప్రకటించారు. విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. -అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- సంక్షేమానికి భారీగా నిధులు
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

**ఏ శాఖకు ఎంతంటే.. (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| పశు సంవర్ధక శాఖ | 1,529 |
| విద్యుత్ శాఖ | 21,285 |
| విద్యా శాఖ | 26,674 |
| వైద్య, ఆరోగ్యం | 13,679 |
| కార్మిక శాఖ | 998 |
| మహిళా శిశు సంక్షేమ శాఖ | 3,143 |
| ఎస్సీ సంక్షేమం | 11,784 |
| ఎస్టీ సంక్షేమం | 7,937 |
| బీసీ సంక్షేమం | 3,769 |
| రాజీవ్ యువవికాసం పథకం | 6 వేల కోట్లు |
| గృహ నిర్మాణ శాఖ | 7,430 |
| పరిశ్రమల శాఖ | 3,490 |
| చేనేత రంగం | 258 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ | 33,688 |
| నీటిపారుదల శాఖ | 22, 615 |
| ఆర్ అండ్ బీ శాఖ | 12,789 |
| న్యాయ శాఖ | 2,367 |
| పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ | 17,907 |
| హోం శాఖ | 11,907 |
| గోదావరి పుష్కరాల నిర్వహణకు | 500 |
| పర్యాటక శాఖ | 1,224 |

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ ఏడాది రూ.3,24,234 కోట్లతో బడ్జెట్ రూపొందించారు. మూలధన వ్యయం రూ.47,267 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వృద్ధి రేటు 8శాతంగా ఉందన్నారు. దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం అధికంగా ఉందని తెలిపారు. దేశ జీడీపీలో రాష్ట్రం 5 శాతం వాటా కలిగి ఉందన్నారు. దేశ వృద్ధి రేటు మందగమనంలో ఉన్న తెలంగాణ వృద్ధి రేటులో పెరుగుదల కనిపిస్తోందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని తెలిపారు. తలసరి ఆదాయం రూ.4.18 లక్షలుగా ఉందని వివరించారు. ఇది దేశ సగటు కంటే భారీగా ఎక్కువ అన్నారు.

### పెట్టుబడుల కోసం..

ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఎంతో మంది ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొన్నారని చెప్పారు. ఈ సమ్మిట్లో 100 వరకు ఒప్పందాలు జరిగాయని, సుమారు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఆసక్తి కనబరిచాయన్నారు.

### నెలకు రూ.2 వేల స్కాలర్‌షిప్

రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీల్లో చదువుతున్న విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొందుతున్న వారికి నెలకు రూ. 2 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఈ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 118 అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతినెల స్కాలర్‌షిప్ ఇస్తామన్నారు.

### ప్రతి కుటుంబానికి జీవితబీమా

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా అమలు చేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. కుటుంబ పెద్ద అకస్మత్తుగా చనిపోతే.. ఆ కుటుంబానికి అండగా ఉండేలా జీవిత బీమా పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా.. పేద, మధ్య, తరగతి, ధనిక అనే తేడాలు లేకుండా రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలకు ఈ పథకం అమలు చేస్తామన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేరిట రూ.5 లక్షలు అందిస్తామని తెలిపారు. ఈ పథకాన్ని జూన్ 2న ప్రారంభిస్తామన్నారు.

### ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ఆరోగ్య బీమా పథకం అమలు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ద్వారా దీనిని అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు 421 ఆస్పత్రుల్లో ఉచిత చికిత్స పొందవచ్చన్నారు. 1,998 వ్యాధులకు ఈ పథకంలో భాగంగా ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

## 67 వేల మందికి ఉద్యోగాలు

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకక 67 వేల మందికి నియామక పత్రాలు అందించామన్నారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశామని తెలిపారు. ఇందులో 51 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని చెప్పారు. వారిలో 20 మంది ఉద్యోగాలు సాధించారన్నారు.


## త్వరలో కొత్త పింఛన్లు

రాష్ట్రంలో కొత్తగా రెండు లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు కొత్త పెన్షన్లు మంజూరు కానున్నాయి.

## విద్యార్థులకు అల్పాహారం

విద్యార్థులకు 202627 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావతో కూడిన అల్పాహారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ఇక నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నారు. సీఎం ఓవర్సీర్స్ ఎప్లాయిమెంట్ ప్రోగ్రాం కింద రాష్ట్ర యువతకు విదేశాలలో ఉపాధి, భాషా నైపుణ్యాలు, వీసా మార్గదర్శకత్వం అందించనున్నారు. ఇంటర్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు 'రెట్రో ఫిట్టెడ్ మోటర్రైజ్డ్' వాహనాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

## ఫోర్బ్స్ జాబితాలో భారత్‌కు 3వ స్థానం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2026లో భారత్‌కు 3వ స్థానం లభించింది. 229 మంది భారతీయులు జాబితాలో చోటు దక్కించుకున్నారు. కొత్తగా 26 మంది ఎంట్రీ ఇచ్చారు. 33 ఏళ్ల అలఖ్ పాండే (ఫిజిక్స్‌వాలా సహవ్యవస్థాపకుడు) ఫోర్బ్స్ జాబితాలోకి ఎక్కారు. టాప్ 3లో ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ, సావిత్రి జిందాల్ నిలిచారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో భారత పౌరులలో అత్యంత ధనవంతుడిగా ముఖేష్ అంబానీ నిలిచారు. అంతేకాకుండా ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్, 20 మంది భారతీయ మహిళా బిలియనీర్ల బృందానికి నాయకత్వం వహిస్తూ, మూడవ అత్యంత సంపన్న భారతీయురాలిగా నిలిచారు. దేశంలోని నాల్గో అత్యంత ధనవంతుడు, ఉక్కు వ్యాపారవేత్త లక్ష్మీ మిట్టల్. ఈ సంవత్సరం టాప్ టెన్ జాబితాలో ఇటీవల పద్మభూషణ్ పురస్కారం అందుకున్న కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు, బిలియనీర్ బ్యాంకర్ ఉదయ్ కోటక్ చేరారు. పేమెంట్స్ యాప్ పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ కూడా ఈ సంవత్సరం తిరిగి ఈ జాబితాలోకి వచ్చారు. ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో కొత్తగా 26 మంది చేరారు. వారిలో మధుర్ బజాజ్ భార్య, కుముద్ బజాజ్, ఖజానా జ్యువెలరీ యజమాని కిషోర్ జైన్, పర్‌ప్లెక్సిటీ ఏఐ సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ తదితరులున్నారు.

## అమెరికా F35 విమానాన్ని కూల్చివేసిన ఇరాన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తాజాగా అమెరికా ఎఫ్-35 యుద్ధ విమానాన్ని కూల్చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు IRGC వీడియో ఫుటేజ్ విడుదల చేసింది. అయితే తమ ఫైటర్ జెట్ సురక్షితంగా ల్యాండ్ అయిందని అమెరికా తెలిపింది. మార్చి 19న గస్తీ నిర్వహిస్తున్నప్పుడు F35A యుద్ధ విమానాన్ని కూల్చి వేసినట్లు ఇరాన్ తెలిపింది. కాగా.. ఎఫ్-35 కూల్చివేతను అమెరికా ఖండించింది. భూమిపై నుంచి విమానంపై కాల్పులు జరపడంతో అమెరికా వైమానిక స్థావరంలో అత్యవసరంగా ల్యాండ్ అవ్వాల్సి వచ్చిందని ప్రకటించింది. కాగా ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థ ఒక F35ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లుగా చూపిస్తున్న ఒక వీడియోను ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ పోస్ట్ చేసింది.

## సెల్ఫీ ఫోజులతో మెస్మరైజ్ చేస్తున్న లక్ష్మీరాయ్..



సెలబ్రిటీలు కాస్త విరామం దొరికింది అంటే చాలు విదేశాలకు వెళ్లిపోయి వెకేషన్ అంటూ ఎంజాయ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇక అలాంటిది సమ్మర్ వస్తే వదులుతారా ? అలా సమ్మర్ వచ్చిందో లేదో అప్పడే వెకేషన్స్ మొదలు పెట్టేసారు హీరోయిన్స్. అక్కడ చిట్టి పొట్టి బట్టలతో అందాలు ఆరబోస్తూ అభిమానులను మెస్మరైజ్ చేస్తున్నారు. అందం , అభినయంతో కట్టిపడేస్తూ గ్లామర్ వలకబోస్తూ యువతకు మంచి ట్రీట్ ఇస్తున్నారు. అలాంటి వారిలో లక్ష్మీ రాయ్ కూడా ఒకరు. సినిమాల నుండి కాస్త విరామం దొరకడంతో వెకేషన్‌కు వెళ్లిపోయిన ఈమె అక్కడ అందాలు ఆరబోస్తూ సమ్మర్ స్పెషల్‌గా చిల్ అవుతూ ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంది.

–అక్షరటుడే, సినిమాడెస్క్